# శాంతికపోతం !

సిటీలో వున్న బిజినెస్ మేగ్నెట్స్‌లో విశ్వం ఒకడు! పదేళ్లక్రితం ఆటోమోబైల్ స్పేర్‌పార్ట్స్ తయారు చేసే యూనిట్ ప్రారంభించి స్వశక్తితో తెలివితేటలతో వ్యాపారాన్ని వృద్ధి చేసాడు.

వ్యాపారం నేటికి యాభై కోట్ల ప్రాజెక్టయింది. మూడు పూవులు ఆరు కాయలుగా వర్ధిల్లటం వెనుక విశ్వం కృషి, శ్రద్ధ తప్ప మరొకటి లేదు.

విశ్వం ఆటోమోబైల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడు. విడి భాగాలను విదేశాలకి సైతం ఎగుమతి చేయగల స్థాయికి చేరుకున్నాడు.

ఈ పదేళ్ల కాలంలో రెండు చేతులా సంపాదించటమే కాకుండా అటు దేశాభ్యుదానికి ఇటు నిరుద్యోగ నిర్మూలనకి దోహదకారి కాగలిగినందుకు ఎంతో తృప్తి పడుతుంటాడు విశ్వం.

అభిరుచి మేరకు పోష్ లోకేలిటీలో అన్ని సదుపాయాలతో బంగళా కట్టించాడు. రెండు ఎ.సి. కార్లు. అందమైన అర్ధాంగి. కాన్వెంట్‌లో చదివే ఇద్దరు పిల్లలు విశ్వానికున్న ప్లస్ పాయింట్లు.

రెండు వందలకి పై చిలుకు ఫ్యాక్టరీలో పనిచేసే సమర్ధవంతమైన కార్మికులు... పాతికమంది దాకా ఆఫీసు స్టాఫ్. ఇద్దరు సెక్రటరీలు. తరచు విమానాల్లో ప్రయాణం. ఎడతేరిపిలేని పన్లు... బిజీ లైఫ్‌తో క్షణం తీరిక లేని విశ్వం గతాన్ని ఎన్నడూ మర్చిపోలేదు.

తను ఇంజనీరింగ్ ఫైనలియర్లో వుండగ ప్రభుత్వోద్యోగంలో వున్న తండ్రి కారు యాక్సిడెంట్‌లో చనిపోవటంతో విశ్వం అప్సెట్ అయ్యాడు. ఏడాది తిరగక ముందే తల్లి కాన్సర్ వ్యాధితో కాలం చేయటం వలన విశ్వం భవిష్యత్ చీకటైపోయింది. ఈ విశాల విశ్వంలో వంటరివాడయ్యాడు.

ఇన్ని కష్టాల్లోనూ పట్టుదలతో చదువు పూర్తి చేసి డిగ్రీ సంపాదించుకున్నాడు.

ఉద్యోగం వెతుకులాటలో ఏడాదికాలం గిర్రున తిరిగింది. మనిషిలో ఏదో చెయ్యాలనే తపన.... మరేదో సాధించాలనే ఆరాటం ఎండమావిగా మిగిలి పోవటంతో మానసికంగా... బాగా కృంగిపోయాడు. బానిసగ ఒకరి క్రింద వుద్యోగం చెయ్యటానికి మనస్కరించలేదు. పోనీ వ్యాపారం చేద్దామా అంటే తన దగ్గర డబ్బులేదు.

మహమ్మారిలా రాజ్యమేలుతున్న నిరుద్యోగ సమస్య.... పేద ప్రజల దుర్భరమైన బ్రతుకులు.. భారత దేశ పటాన్ని సాలెగూడులా అల్లుకున్న అవినీతి... పెచ్చరిల్లుతున్న ఆశ్రిత పక్షపాతం... మనుష్యులను బ్రహ్మరాక్షసిలా మింగేస్తున్న స్వార్థం..వీటన్నిటి మధ్య కేవలం ఓ సీదా సాదా అభాగ్యుడిలా జీవించటం విశ్వానికి ఇష్టంలేకపోయింది.

ఈ వ్యవస్థని మార్చాలనే తపన. సమాజాన్ని సంస్కరించాలంటే ఆరాటం విశ్వాన్ని గందరగోళ పెడుతున్నాయ్.

కాని...ఎలా? వంటరిపోరాటం వల్ల అది సాద్యపడదనే యదార్థాన్ని గ్రహించాడు.

మార్పు 'విప్లవం' ద్వారానే సాధ్యపడుతుందనే సిద్ధాంతంపట్ల ఆకర్షితుడయ్యాడు. ఇదే ఆశయంతో చదువుకునే రోజుల్లో... ఒకరిద్దరు ఫ్రెండ్స్ చదువు మానేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయి తుపాకి చేత బూనటం విశ్వానికి గుర్తొచ్చింది

సామాజిక ఆర్థిక న్యాయం కోసం పోరాట వుద్యమంలో చేరటానికి సిద్ధపడ్డాడు విశ్వం.

ఆశయ సిద్ధికోసం తపనతో ఆరాటంతో తుపాకి పట్టాడు... అడవుల్లో... కొండల్లో...కోనల్లో.. కడపు నిండా తిండిలేక... కంటికి నిద్రలేక వుద్రేకంతో పోరాటం సాగించాడు. ఎందరి చావుకో కారకుడయ్యాడు. తన సహచరులు మృత్యువాత పడటం చూస్తూ చలించిపోయాడు.

ఇట్లా ...రోజులు...నెలలు... సంవత్సరాలు...గడిచిపోయినయ్.

పోరాటాలతో విసిగిపోయాడు. తనేం సాధించాననే ప్రశ్నలు విశ్వాన్ని వేధించసాగాయి. చివరికి తన ఆలోచన్లను మార్చుకునే పరిస్థితి ఏర్పడింది.

చీకటి బ్రతుక్కి స్వస్తి చెప్పాలని నిర్ణయించుకున్నాడు. జన జీవన స్రవంతిలోకొచ్చి బ్రతకాలని వుత్సాహపడ్డాడు. అతనిలో జ్ఞాననేత్రం తెరచుకుంది.

ప్రభుత్వానికి లొంగిపోయాడు. సమాజంలో గర్వంగా తలెత్తుకుతిరిగాడు. తనలోని ఆలోచన్లకి పదునుపెట్టాడు. ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సహాయాన్ని అందుకున్నాడు. ఇండస్ట్రీ ప్రారంభించాడు. అప్పటి విశ్వం ధోరణివేరు. ఇప్పటి ఆలోచనా సరళి వేరు... తనలో ఎంత మార్పు?

వ్యాపారంలో తలమునకలవుతూ... న్యూస్‌పేపరు చదివేందుకు సమయం కూడా దొరకటం లేదిప్పుడు.

గత మూడేళ్ళుగా 'అత్యుత్తమ ఉత్పాదకత' అవార్డు వరుసగా అందుకున్నాడు. తన కలలు ఫలించినయ్.

గొప్పగా వెలిగిపోతున్న విశ్వంలో ఇప్పుడు ఎలాంటి కోరికలూ లేవు. ఆశలు అంతకంటే లేవు. కేవలం ఆశయాలు మాత్రమే మిగిలాయి.

ఆశయ సిద్ధికోసం శ్రీకారం చుట్టేడు. ఎంతో కాలంగా మనసులో తిష్టవేసుకున్న వూహలకి ఓ రూపం ఇచ్చి తన ఫ్యాక్టరీ ప్రాంగణంలో వర్కర్స్ కోసం... వారి ఐకమత్యానికి మత సామరస్యానికి ప్రతీకగా ఒక దేవాలయాన్ని... ముస్లిం సోదరుల కోసం ప్రార్థనా స్థలాన్ని... క్రైస్తవుల ఆరాధన కోసం చర్చిని కట్టించిన ఘనత విశ్వానికే దక్కింది.

విశ్వం ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికుల్లో అశాంతి లేదు. అసంతృప్తి లేదు. కోరికలు అంతకంటే లేవు. కష్టపడి పనిచేయటం. క్రమశిక్షణతో నడుచుకోవటం మాత్రమే అక్కడి

కార్మికులకు తెల్సు! పనివారి శక్తి సామర్థ్యాలను గుర్తెరిగి బ్రతకటానికి సరిపడా జీతాలు ఇచ్చే సంస్కారం విశ్వంలో వుండటం వర్కర్సు అదృష్టం. శ్రామిక వర్గాన్ని ఏవిధంగా తృప్తి పరచాలో, వారి శ్రమశక్తిని ఎలా గుర్తించాలో విశ్వానికి ఎవరూ చెప్పక్కర్లేదు.

కార్మికులకు యాజమాన్యంతో సత్‌సంబంధాలు వున్నాయి. కనుకనే ఈ పదేళ్లకాలంలో ధర్నాలు. ఘెరావ్‌లు.. సమ్మెలు మచ్చుకు ఒక్కరోజైనా విశ్వం ఫ్యాక్టరీలో చోటు చేసుకోలేదు.

★★★★★

గోడ గడియారం పదకొండు గంటలు లయబద్ధంగా కొట్టింది.

ఆఫీసులో వారంతా ఎవరిపనుల్లో వారు నిమగ్నమైవున్నారు.

ఎయిర్ కండీషన్డ్ ఛాంబర్లో రివాల్వింగ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్లో కూర్చున్న విశ్వం ఫైళ్ళు చూడటంలో నిమగ్నమైనాడు.

టెలిఫోన్ మ్రోగింది. విశ్వం రిసీవర్ అందుకున్నాడు.

"సార్... మీతో మాట్లాడాలట... కనెక్ట్‌చెయ్యమంటారా?" మృదుమధురంగా పర్సనల్ సెక్రటరీ అడిగింది.

"హూ ఈజ్ కాలింగ్ పార్టీ" ప్రశ్నించాడు విశ్వం.

"వివరాలు చెప్పటం లేదు సార్"

"ఆల్‌రైట్.. కనక్ట్‌మి..." ముందున్న ఫైలు పక్కకునెట్టి ఛైర్లో రిలాక్స్ అయ్యాడు.

"మిస్టర్ విశ్వం." అవతలి వ్యక్తి కంఠం ఫోన్లో, ఖంగున విన్పించింది.

అందుకు అనీజీ ఫీలైనాడు విశ్వం.

"యస్. స్పీకింగ్." బదులిచ్చాడు.

"నేనెవరో మీకు చెప్పనవసరం లేదు. నా గురించి తెల్సుకునే ప్రయత్నం చెయ్యకండి.- నే చెప్పేది జాగ్రత్తగా వినండి"

ఏమిటి అసందర్భపు ప్రేలాపన ఫోన్లో? మినిమం కర్టసీ లేకుండా మాట్లాడే వ్యక్తి ఎవరైవుంటాడు? ఎందుకోసం ఫోన్ చేస్తున్నట్టు?

"వింటున్నారా?-" స్వరం రెట్టించింది అవతలి కంఠం.

అప్పటి వరకు మౌనం వహించిన విశ్వం నిట్టూరుస్తూ.." "హూ..." అన్నాడు.

"అర్జంటుగా అయిదు లక్షలు కావాలి."

నిర్ఘాంతపోయాడు విశ్వం. లిప్తపాటు నోట మాట కరువైంది.

తనను తాను సంబాళించుకుంటూ "ఎవరిక్కావాలి అంత డబ్బు?"

"ప్రశ్నలు వేయద్దు. చెప్పి నట్టు చెయ్. రాత్రి పదకొండు గంటలకి కోరిన డబ్బు నువ్వు

అందించాలి. తెల్సిందా?"

"ఇంతకూ మీరెవరు?" రెట్టించిన స్వరంతో ప్రశ్నించాడు విశ్వం.

"తర్వాత మీకే తెలుస్తుంది. విజయవాడ వెళ్లే బస్‌రూట్‌లో సిటీ దాటి పాతిక కిలోమీటర్లు వచ్చాక ఎడమవేపు డొంక రూట్‌కన్పిస్తుంది. అటుకేసి ఒక కిలోమీటరు రాగానే పాడుబడినబంగళా అవుపిస్తుంది. అక్కడికొచ్చి మీరు డబ్బుతో వున్న బ్రీఫ్‌కేస్ అందించాలి. తెల్సిందా? మీరు రాకపోయినా... పోలీసుల సహాయం కోరినా మీకే ప్రమాదం"

"డోంటాక్ రబ్బిష్." విశ్వంలో వుద్రేకం కట్టలు తెంచుకుంది.

"షటప్! చెప్పినట్టు చెయ్."

తాను ఇంకేదో మాట్లాడాలనుకుంటూండగానే అవతల వ్యక్తి ఫోన్ రిసీవర్ పెట్టిన శబ్దం వినిపించింది.

ఇది తీవ్రవాదుల బెదిరింపుచర్యే అయివుంటుందనే అభిప్రాయానికొచ్చిన విశ్వం ఛైర్లో రిలాక్స్ అయి సిగరెట్ వెలిగించాడు.

★★★★★

రాత్రి పదిగంటలు కావస్తోంది.

ఫైళ్లుచూచుకుంటూ ఆఫీసులో ఒంటరిగా మిగిలిపోయాడు విశ్వం.

అతనిలో ఆందోళనగానీ అదుర్దాగానీ లేవు.

ఫోన్ రింగ్ అయింది.

రిసీవర్ అందుకున్నాడు.

"ఓ, నువ్వా? నేను మీటింగులో వున్నాను. రావటానికి లేటవుతుంది. నువ్వూ పిల్లలూ భోజనం చేసి పడుకోండి" అబద్ధం చెప్పి రిసీవర్ హుక్ మీద వుంచాడు విశ్వం.

తన ఎదురుగా వున్న బ్రీఫ్ కేస్ తెరిచాడు. వరుసగా సర్దివుంచిన వందరూపాయల నోట్ల కట్టలు దర్శనమిచ్చినయ్ తృప్తిగా నవ్వుకున్నాడు. సిగరెట్ వెలిగించి బ్రీఫ్‌కేస్‌తో బయల్దేరాడు.

బెంజీకారు తారురోడ్డు మీద మెత్తగా పరుగెడుతున్నది.

నోట్లో పెదాలమధ్య త్రిబుల్‌ఫైవ్ సిగరెట్. చేతిలో స్టీరింగు, పక్కసీట్లో నోట్ల కట్టలతో బరువెక్కిన బ్రీఫ్‌కేసు.

తన గమ్యాన్ని సూచించినట్లు ఇరువై అయిదవ కిలోమీటర్ రాయి రాగానే స్పీడు తగ్గించాడు. డొంకరోడ్డు హెడ్ లైట్ల వెలుగులో కన్పించింది అటుకేసి పోనిచ్చాడు.

కొంత దూరం పోయాక కారు ఆపాడు. నిబ్బరంగా బ్రీఫ్‌కేసుతో దిగాడు. చుట్టూ పరికించాడు.

చిమ్మచీకటి..

అంతా నిర్మానుష్యంగా వుంది. ఎవరో తనవేపే నడిచివస్తున్న అలికిడి అయింది. టార్చిలైట్ వెలుగు విశ్వం ముఖం మీద పడ్డది.

"ఒంటిరిగానే వచ్చావా?"

ప్రశ్నించిన స్వరాన్ని పొద్దుట తనతో ఫోన్లో మాట్లాడిన వ్యక్తిదేనని గుర్తించాడు విశ్వం.

ఆరుగురు వ్యక్తులు దగ్గరగా వచ్చి తన చుట్టూ వలయాకారంలో నిలబడ్డారు. వంటిన యూనిఫారం, ముఖాలకు ముసుగు, చేతుల్లో తుపాకులూ వుండటం గమనించాడు.

"డబ్బు తెచ్చావా?" మరోవ్యక్తి గద్దించినట్టు అడిగాడు.

"ఇదిగో..", విశ్వం బ్రీఫ్ కేసు అందించాడు.

బ్రీఫ్‌కేస్ తెరచి అందులో డబ్బుందోలేదోని టార్చిలైట్ వెలుగులో చూచుకున్నాడు.

"కావాలంటే ఇంకా ఇస్తాను.." ఆవేశంగా అన్నాడు విశ్వం.

ఆరుగురూ మౌనం దాల్చారు.

"మీరు ఈ డబ్బుతో ఏం చేస్తారో నాకు తెల్సు-నేను వూహించగలను. తుపాకులు కొంటారు. మందుగుండు సామాగ్రి కోసం ఖర్చు పెడతారు. అంతేగా?" కూల్‌గా అన్నాడు.

"అవును.. అందుకే! డబ్బున్న వారిని దోచుకుంటే గాని... మా అవసరాలు తీరవ్". ఓ ముసుగు వ్యక్తి కటువుగా మాట్లాడాడు.

మిగతా అయిదుగురూ పగలబడి నవ్వారు.

"నవ్వకండి. ప్లీజ్! ఇలా ఎన్నాళ్లు. ఎన్నేళ్లు ఒకరి దయాదాక్షిణ్యాలమీద అధారపడతారు? మీ అవసరాలను, ఆవేశాన్ని అర్థం చేసుకోగలను. కానీ... నే కోరేదల్లా ఒక్కటే... మీ చీకటి బ్రతుక్కి చరమగీతం పాడండి! నా వెంట రండి. మీకు వెలుగు మార్గం చూపిస్తాను. నా ఫ్యాక్టరిలో ఉద్యోగాలిస్తాను. మంచి జీతాలిస్తాను. దర్జాగా, హాయగా బ్రతకొచ్చు," అన్నాడు విశ్వం.

"ఇక నువ్వెళ్ళొచ్చు." కటువుగా అన్నాడోవ్యక్తి.

"నేను ఒంటరిగా వెళ్ళను."

"అంటే మమ్మల్ని పోలీసులకి అప్పజెప్పాలనా?"

"కాదు."

"మేము సిద్ధాంతాలకోసం పోరాటం సల్పుతున్న వాళ్ళం. మా లక్ష్యం వేరు. గమ్యం వేరు.. నువ్వెళ్ళిపో."

"కేవలం డబ్బున్నవాడిగానే నన్ను మీరు ఎరుగుదురు. కాని నేనెవరో... నా గతం ఏమిటో మీకు తెలియదు. కొన్నేళ్ళక్రితం నేనూ మీలాగే తుపాకి చేత పట్టి ఉద్యమం నడిపాను. ఎన్నో దురాగతాలు.. మరెన్నో దారుణాలకి ఒడిగట్టాను. ఎందరినో చంపాను. రైళ్ళు పడగొట్టాను.

ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేశాను. ఆశయం అంటూ నా జీవితాన్ని సర్వనాశనం చేసుకున్నాను. ఏమీ సాధించలేక పోయాను. నన్ను ప్రాణాలతో పట్టి అప్పగించిన వారికి అయిదు లక్షల బహుమానం ప్రభుత్వం ప్రకటించింది- కాని నేను ఎవ్వరికీ దొరకలేదు"

విశ్వం చెపుతున్నది వింటూ శిలాప్రతిమల్లాగ నిల్చుండిపోయారు.

"నా పేరు అప్పుడు విస్సన్న-ఇప్పటి పేరు విశ్వం!"

విస్సన్న పేరు చెప్పగానే విస్తుపోయారంతా!

" అన్నా.. విస్సన్న నువ్వేనా?! నీ గురించి గొప్పగా విన్నాం. ఈనాడు నిన్ను కళ్ళారా చూసే భాగ్యం కలిగింది" అందరూ వంగి విశ్వానికి పాదాభివందనం చేశారు.

"మీరెరుగని విస్సన్నని నేనే! పోరాటాలతో... విధ్వంస చర్యలతో విసిగిపోయిన నాకు జ్ఞానోదయమైంది. ఏదో సాధించాలనుకున్న నేను తుపాకీతో... తుటాలతో ఏమీ సాధించలేకపోయాననే యాదార్థాన్ని గుర్తించాను.అనుక్షణం ప్రాణ భయంతో బ్రతకటం అవివేక మన్పించింది. కళ్ళు తెరిచాను. భారతపౌరుడిగా..గౌరవంగా బ్రతకాలనే నిర్ణయానికొచ్చి బేషరతుగా... స్వచ్ఛందంగా ప్రభుత్వానికి లొంగిపోయాను. నా నిర్ణయం నా జీవిత పంథానే మార్చివేసింది."

విశ్వం మాటలు వింటూ వాళ్ళ చేతుల్లో తుపాకులు అప్రయత్నంగా నేల వాలాయి.

"ఏ ప్రభుత్వమైతే నన్ను పట్టుకునేందుకు బహుమతి ప్రకటించిందో... నేను లొంగిపోయాక నాకు అన్ని విధాలా చేయూతనిచ్చింది. మంచి మనిషిగా బ్రతకటానికి మార్గం చూపింది. ఆర్థికంగా నన్ను ఆదుకుంది. ఈనాటి నా వున్నతికి మూలకారణమైంది"

ఆరుగురు వ్యక్తులు వారి ముసుగులు తొలగించారు. అశ్రుపూరిత నయనాలను చీకట్లో తుడుచుకున్నారు.

"అన్నా! మాకు కనువిప్పు కలిగించావు. మా తప్పు తెల్సుకున్నాం. మా జీవిత పంథాను మార్చుకుంటాం..."ముక్తకంఠంతో అన్నారందరూ.

"నేకోరేది ఒక్కటే! హింసను... రక్తపాతాన్ని విడనాడండి.. నాతోరండి... జనజీవన స్రవంతిలో కలవండి. సుఖసంతోషాలతో బ్రతకండి.."

"నువ్వు చాలా గొప్పోడివన్నా. సిద్ధాంతాల వూబిలో ఇరుక్కుపోయిన మా కళ్లు తెరిపించావు. నీ అడుగుజాడల్లో నడవటానికి సిద్ధంగా వున్నాం". గద్గద కంఠంతో తమ నిర్ణయాన్ని వ్యక్తం చేశారు.

తన ప్రయత్నం సఫలమైనందుకు తృప్తిగా గాలిపీల్చుకున్నాడు విశ్వం.

అప్యాయంగా అందరినీ తన కౌగిట ఇముడ్చుకున్నాడు.

అందరూ ఏకమై కారువేపు నడిచారు!

-:(సమాప్తం):-

('ఆంధ్రభూమి' మంత్లీ నవంబర్ 2001)